సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 28 । జూలై । 2025



కంప్యూటర్ సైన్స్‌కే మొగ్గు

ఇటీవల జరిగిన ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో జిల్లాలోని కాలేజీల్లో సీఎస్‌ఈ బ్రాంచ్ సీట్లు **పూర్తిగా భర్తీ అయిపోయాయి.**

8లో



మట్టి దందా

పచ్చనేతలు మట్టినే వ్యాపారంగా ఎంచుకున్నారు. చెరువులు, కాలువ గట్లను తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా మట్టి దందాను సాగిస్తున్నారు.

8లో



కేంద్రం మార్పుతో గందరగోళం

ఎయిడెడ్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం చేపట్టిన పరీక్షకు సంబంధించి కేంద్రం మార్పుపై **అభ్యర్థులు నిరసన** వ్యక్తం చేశారు.

8లో

న్యూస్‌రీల్

దివ్యాంగుల ఇంటికి చేరని రేషన్



అల్లాడి నటరాజు

ఆకివీడు : దివ్యాంగులకు రేషన్ సరుకులు ఇంటి వద్దకే తీసుకువెళ్లి ఇవ్వాలనే ఆదేశాలను రేషన్ డీలర్లు అమలుచేయడం లేదని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి నటరాజు ఆరోపించారు. ఆకివీడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలాచోట్ల దివ్యాంగులకు రేషన్ సరుకులు ఇంటి వద్దకు వచ్చి ఇవ్వడం లేదని, వేలిముద్ర తీసుకుని వెళ్లి షాపు వద్దకు వచ్చి సరుకులు తీసుకోవాలని డీలర్లు చెబుతున్నారన్నారు. డీలర్ల వద్ద ఉన్న జాబితాలో తమ పేర్లు లేకపోతే రేషన్ ఇవ్వడం లేదని దివ్యాంగులు వాపోతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. దివ్యాంగుడి పేరు ఉంటే ఆ కుటుంబానికి రేషన్‌ను డీలర్ ఇంటి వద్దకు తీసుకువెళ్లి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రేషన్ డిపోలను దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. అంత్యోదయ అన్న యోజన కింద 35 కేజీల బియ్యం దివ్యాంగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒంటరి దివ్యాంగులకు ఒంటరి రేషన్ కార్డు ఇవ్వాలని నటరాజు కోరారు.

ధర్మస్థల దోషులను శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

ఏలూరు (టూటౌన్): ధర్మస్థల మారణకాండలో దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు నగర కమిటీ డిమాండ్ చేసింది. ఏలూరు నగర సమితి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కమిటీ నాయకులు అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, కొండేటి బేబీ, కొల్లూరి సుధారాణి మాట్లాడుతూ కర్ణాటకలోని మంజునాథ ఆలయంలోని ధర్మస్థలలో మహిళల మానప్రాణాలను హరిస్తూ సుమారు 500 మందిని చంపి పూడ్చి పెట్టడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. తక్షణమే ఇందుకు కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. నగర సహాయ కార్యదర్శి కొల్లూరి సుధారాణి, ఉపాధ్యక్షురాలు గొర్లి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల వీరంగం



ఆకతాయిలను వారిస్తున్న స్థానికులు

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగేనగర్‌లో ఆకతాయిలు వీరంగం సృష్టించారు. డాంగేనగర్ 10వ సచివాలయం సమీపంలో ఆదివారం ఆకతాయిలు మద్యం మత్తులో రోడ్డును అడ్డగించారు. రోడ్డుపై వెళుతున్న మహిళల రాకపోకలకు ఇబ్బంది కలిగించారు. స్థానికులు అడ్డుకోవడంతో పరిస్థితి సర్దుమణిగింది. మహిళలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బహిరంగ మద్యపానం ఎక్కువగా జరుగుతోందని, మందుబాబుల వల్ల రోడ్డుపై వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని అన్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.రవి మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలకు వ్యతిరేకంగా సోమవారం నుంచి ఇంటింటా ప్రచారం, సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. ఆగస్టు 5న జిల్లావ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాలు, మండల కేంద్రాల వద్ద ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు.

పీ 4 అమలులో తడబాటు

- జిల్లాలో 64,940 కుటుంబాలు గుర్తింపు
- ఇప్పటివరకు ముందుకు వచ్చిన మార్గదర్శకులు 1,425 మంది..
- మళ్లీ రీ సర్వే పేరిట కాలయాపన
- సర్కారు తీరుతో తల పట్టుకుంటున్న అధికారులు
- అసలు పీ 4 కాన్సెప్ట్ సరికాదంటున్న మేధావి వర్గాలు
- పేదల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టడమేనని అభిప్రాయం



సాక్షి, భీమవరం: అట్టడుగు పేదల కోసమంటూ ప్రచారం చేసుకుంటున్న పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టనర్‌షిప్ (పీ-4) అమలుకు చంద్రబాబు సర్కారు ఆపసోపాలు పడుతోంది. సర్కారు పిలుపునకు సంపన్నుల నుంచి స్పందన లేక సర్వేల పేరిట కాలయాపన చేస్తోంది. జిల్లాలో 64,940 కుటుంబాలకు ఇప్పటివరకు ముందుకు వచ్చిన మార్గదర్శకులు 1,425 మంది మాత్రమే ఉన్నారు. పీ-4 ద్వారా అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను సంపన్నుల సాయంతో పైకి తెచ్చి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దుతామని కూటమి చేస్తున్న ప్రచారం విదితమే. తొలుత ఉగాదికి అమల్లోకి తెస్తామని చెప్పగా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జిల్లాలోని 535 సచివాలయాల పరిధిలో 4,92,292 కుటుంబాలకు పలు వడపోతలు, సర్వేల నడుమ 64,940 కుటుంబాలను అర్హులుగా ఎంపిక చేశారు. ఈ కుటుంబాల పరిధిలో 1,70,803 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐలు, సంపన్నులను గుర్తించి వారిని పీ-4 మార్గదర్శకులుగా భాగస్వాముల్ని చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం అధికారులపై ఉంచింది. దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలు అన్ని అంశాల్లో సాధికారత సాధించేలా, వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా మార్గదర్శులు కృషి చేయాలి.

రీసర్వే పేరిట తాజాగా ఇచ్చిన మార్గదర్శకాలు

గ్యాస్ కనెక్షన్ లేకుండా ఉండాలి, ఇంటికి విద్యుత్ కనెక్షన్ లేనివారు, ఆదాయం లేని కుటుంబం (ఉద్యోగం, రెంట్, ఇంటరెస్ట్, పెన్షన్ లేనివారు), రక్షిత నీరు అందుబాటులో లేక తెచ్చుకునేందుకు 30 నిమిషాలు సమయం పట్టేవారు. బ్యాంక్ ఖాతా లేని కుటుంబం. వీటిలో కనీసం ఒక్కటి వర్తించినా ఆ కుటుంబం అర్హులవుతారు.

అనర్హతలు : 5 ఎకరాలకన్నా ఎక్కువ భూమి, లేదా 2 ఎకరాలకన్నా ఎక్కువ మాగాణి భూమి కలిగి ఉండటం. కుటుంబంలో ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగం, పట్టణంలో ఆస్తిపన్ను, కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నా, ఫోర్ వీలర్, 200 యూనిట్ల కన్నా అధిక విద్యుత్ వినియోగం. వీటిలో ఏ ఒక్కటి ఉన్నా అనర్హులవుతారు.

ఆసక్తి చూపని సంపన్న వర్గాలు

పీ-4 కార్యక్రమంపై సంపన్న వర్గాలు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఎంపిక చేసిన కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ఆగస్టు 15 నాటికి జిల్లాలో 15 వేల మంది మార్గదర్శకులను గుర్తించాల్సి ఉంది. అయితే 1,425 మందిని మాత్రమే గుర్తించినట్టు తెలుస్తోంది. 346 సచివాలయాల పరిధిలోని 15,933 కుటుంబాలను మార్గదర్శకులకు అనుసంధానం చేసినట్టు సమాచారం. నిర్ణీత గడువు నాటికి మార్గదర్శకుల గుర్తింపు లక్ష్యం చేరుకునేందుకు ఉన్నత స్థాయి నుంచి వస్తున్న ఒత్తిడితో జిల్లా యంత్రాంగం తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే చారిటీలు పెట్టామని, కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ ఫండ్‌తో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని కొందరు, తెలిసిన పేదలకు చేతనైనంతలో సాయం చేస్తున్నామని మరికొందరు సంపన్నులు పీ-4పై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో మళ్లీ వడపోత చేస్తూ రీ సర్వేకు ఆదేశాలివ్వడం అనుమానాలకు తావిస్తోంది.

బాధ్యతను విస్మరించి..

ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రజల హక్కుగా ప్రభుత్వమే నేరుగా వారి సంక్షేమానికి పాటుపడాలి. ఆ బాధ్యతను సంపన్నులకు అప్పగించడం పేదల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేదలు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందితే ఎవరికీ జవాబుదారీగా ఉండాల్సిన పని ఉండదు. అది తమ హక్కుగా భావిస్తారు. మరొకరి నుంచి సాయం ఇప్పించడం పేదలను వారి చెప్పుచేతల్లో పెట్టడమేనని పలువురు అంటున్నారు. ప్రస్తుతానికి పైకి బాగానే ఉన్నా భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు.

ఈ విధానం సరికాదు



పూర్వం సంపన్న వర్గాలు సాయం, అప్పు రూపంలో డబ్బులిచ్చి అందుకు తగ్గట్టుగా పనిచేయించుకునేవారు. 1976లో కేంద్ర ప్రభుత్వం ఈ వెట్టిచాకిరీని రద్దుచేస్తూ చట్టం చేసింది. ప్రస్తుత పీ-4 గతాన్ని గుర్తుచేస్తోంది. పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అందుకు నేరుగా అవసరమైన సాయం అందించాలే తప్ప ఈ విధానం సరికాదు.

– కామన బాల సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, నరసాపురం

బాధ్యత గాలికొదిలేయడమే



ధనికులే బాధ్యత తీసుకుని పేదల్ని ఉద్ధరించింది ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. ప్రభుత్వం పేదల సంక్షేమం–బాధ్యత నుంచి వైదొలగాలనుకోవడం దారుణం. మరోవైపు పేదల సంక్షేమం బాధ్యత ధనవంతుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాలనడం సరికాదు. ప్రజలపై పన్నుల ద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్న ప్రభుత్వాలు ప్రజల సంక్షేమ బాధ్యతను గాలికొదిలేయడం అన్యాయం.

– బి.బలరాం, సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు

పారదర్శకంగా అందించాలి



అర్హులైన పేద, దిగువ మధ్యతరగతి వర్గాల వారందరికీ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పారదర్శకంగా సంక్షేమాన్ని అందజేయాలి. అంతేకానీ పీ4 విధానంలో వ్యక్తిగత లబ్ధి అందిస్తానని అనడం కరెక్ట్ కాదు. ఇలాంటి విధానాలతో వ్యక్తిగత హక్కులకు భంగం వాటిల్లే అవకాశం ఉంది.

– ఎస్‌వీ జాకబ్ బాబు, ఎస్‌టీఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి

భూసేకరణపై ఆరోపణల వెల్లువ

రెడ్డిగణపవరంలో సర్వే చేయకుండా భూసేకరణపై విమర్శలు

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో చేపట్టిన భూసేకరణపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌టీఆర్ భూములను 1/70కి విరుద్ధంగా అధికారులు సేకరిస్తున్నారంటూ సీపీఎం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్షలు జరుగుతున్నాయి. తాజాగా ఆదివారం రవిచంద్ (రెడ్డిగణపవరం) అనే వ్యక్తి రెడ్డిగణపవరం పరిధిలో భూసేకరణపై ఆరోపణలు చేస్తూ వీడియోను విడుదల చేశారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భూములపై ఎలాంటి సర్వే చేయకుండా అధికారులు వారికి నచ్చిన విధంగా భూసేకరణ చేస్తున్నారు. అలాగే ఐదు ఎకరాలు ఉంటే ఏడు ఎకరాలని, 10 ఎకరాలు ఉంటే 15 ఎకరాలని నమోదు చేస్తున్నారని ఆరోపించారు. సర్వే నంబర్ ప్రకారం ఎక్కడా భూములు తీసుకోవడం లేదని తదుపరి ఆ భూముల్లోకి వచ్చే నిర్వాసితులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో సేకరించిన భూముల్లో కూడా ఇలాంటి సమస్యలే తలెత్తాయన్నారు. ఈ సేకరణ నిమిత్తం పెద్ద మొత్తంలో సొమ్ములు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. ఈ ఆరోపణలు చేసింది సాక్షాత్తూ టీడీపీకి చెందిన వ్యక్తే అని పలువురు చెబుతున్నారు. ఇదే వీడియోను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు చేరేలా ఫార్వార్డ్ చేయాలనడం బుట్టాయగూడెం మండలంలో సంచలనం రేపింది.

గురువులపై ‘బోధనేతర’ భారం

- ఉపాధ్యాయులతో ఇతర పనుల చేయిస్తున్న ప్రభుత్వం
- పని భారం, ఒత్తిళ్లతో సతమతం
- బదిలీ ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాల్లేవు
- సమస్యల పరిష్కారానికి నిరసనల బాట
- పట్టించుకోని కూటమి సర్కారు



భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు బోధనేతర విధులతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం యోగాంధ్ర, పేరెంట్ మీటింగ్స్, యాప్‌లు, శిక్షణ, ఫొటోలు అప్‌లోడ్ వంటి పనులు అప్పగించడంతో వీరంతా విసుగు చెందుతున్నారు. పూర్తిస్థాయిలో బోధన సమయం తగ్గిపోయి మొక్కుబడిగా పాఠాలు చెప్పే పరిస్థితి వస్తోందని, దీంతో విద్యార్థుల విద్యా ప్రమాణాలు తగ్గిపోతాయని అంటున్నారు. బోధనేతర విధులతో పని భారం పెరగడంతో పాటు ఒత్తిళ్లతో ఇబ్బంది పడుతున్నట్టు ఆవేదన చెందుతున్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం నిరసనలు, దీక్షలు చేస్తున్నారు.

ఒత్తిళ్లతో ప్రాణాలు కోల్పోయి..

కూటమి ప్రభుత్వం దూరప్రాంతాల్లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలతో ఉపాధ్యాయులు ఒత్తిళ్లకు గురవుతున్నారు. ఇలా జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులు శిక్షణకు వెళ్లి ప్రాణాలు కూడా కోల్పోయారు. పాలకొల్లు మండలం అరట్లకట్ల హైస్కూల్ హెచ్ఎం మూర్తిరాజు, ఉండి మండలం ఉణుదుర్రులో ఇన్‌చార్జి హెచ్ఎం టీవీ రత్నకుమార్ శిక్షణ కార్యక్రమాలకు వెళ్లి మృతి చెందిన ఘటనలతో ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు.

రెండు నెలలుగా జీతాల్లేవ్

పాఠశాలల రేషనలైజేషన్‌లో భాగంగా రీ అపోర్షన్ చేసి బదిలీ చేసిన 300 మంది ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదు. దీంతో వీరంతా ఇబ్బంది పడుతున్నారు.

హామీలు బుట్టదాఖలు

గత ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత మర్చిపోయారు. ఐఆర్, పీఆర్సీ, డీఏలు అమలు చేస్తామన్న హామీలు 14 నెలలు గడుస్తున్నా అమలు కాలేదు.

కలెక్టరేట్ వద్ద నిరసన

తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఉపాధ్యాయులు భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. డీఈఓకు వినతిపత్రం సమర్పించారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు

- యాప్‌ల భారం, పని భారం తగ్గించాలి.
- కేడర్ స్ట్రెంత్ సమస్య పరిష్కరించాలి.
- రెండు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి.
- శిక్షణలో చనిపోతున్న ఉపాధ్యాయులకు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలి.
- డీఏ, ఐఆర్ వంటి హామీలను నెరవేర్చాలి.
- ఆప్షనల్, లోకల్ సెలవుల్లో ఆంక్షలు తొలగించాలి.
- పుస్తకాలు, డైరీల రాత తగ్గించాలి.

హామీలు అమలుచేయాలి



ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో పిల్లలకు పాఠాలు చెప్పే సమయం తగ్గిపోతుంది. యాప్‌ల భారం, శిక్షణ కార్యక్రమాల వల్ల ఒత్తిళ్లకు గురై ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం.

– బొర్రా గోపిమూర్తి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

బోధనేతర పనులు వద్దు



బోధనేతర పనులతో బోధనా సమయం తగ్గిపోతుంది. సింగల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో కూడా 18 పుస్తకాలు, డైరీ రాయడం, యాప్ నిర్వహణ తదితర పనుల భారంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించి పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలి.

– పి.విజయరామరాజు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

జీతాలు రాక ఇబ్బందులు



రేషనలైజేషన్ చేసి రి అపోర్షన్ చేసిన ఉపాధ్యాయులు రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈఎంఐలు కట్టడానికి, కుటుంబ ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి. పెనాల్టీలతో ఈఎంఐలు కడుతున్నారు. ఉపాధ్యాయులకు జీత బకాయిలు వెంటనే చెల్లించాలి.

–వి.వెంకటేశ్వరరావు, హెచ్ఎం, సీపీఎస్ సంఘ జిల్లా అధ్యక్షుడు

సమస్యలు పరిష్కరించాలి



యాప్‌లు, ఇతర పనుల తోపాటు యోగా, పేరెంట్స్ మీటింగ్ వంటి అదనపు కార్యక్రమాలతో బోధనా సమయం వృథా అవుతుంది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నాం. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి, హామీలు అమలు చేయాలి.

– ఏకేవీ రామభద్రం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

షాపు అద్దెల మాయాజాలం

ధనార్జనే కూటమి లక్ష్యం

- కార్పొరేషన్ షాపుల అద్దెలు సగానికి కుదింపు
- కూటమి నేతల అనుయాయులకే దుకాణాల కేటాయింపు
- ఏలూరు నగరపాలక సంస్థ షాపులపై కన్ను
- మున్సిపల్ నిబంధనలు పాటించని వైనం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



ఏలూరు వన్‌టౌన్ చందనా బ్రదర్స్ రోడ్డులో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లోని దుకాణాల్లో అద్దెల మాయాజాలం నడుస్తోంది. డిమాండ్ ఉన్న షాపులను కూటమి నాయకులు, వారి అనుచరులు అయినకాడికి అందుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. షాపుల అద్దె పెరిగిన సందర్భాల్లో గుట్టుచప్పుడు కాకుండా వాటిని ఖాళీ చేయించి, మరలా బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. ఇలా వేలం నిర్వహించిన సందర్భాల్లో తమ కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేర్లతో షాపులను దక్కించుకుంటున్నారు. దీంతో ఏలూరు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ‘వడ్డించే వాడు మనవాడైతే’ అన్న చందంగా షాపుల కేటాయింపులు జరుగుతున్నాయి.

746 షాపులు.. రూ.4.80 కోట్లు

కార్పొరేషన్ పరిధిలో 746 షాపులు ఉండగా ప్రస్తుతం 125 ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 621 షాపులు అద్దెకు నడుస్తున్నాయి. ఏటా షాపు అద్దెల రూపంలో కార్పొరేషన్‌కు రూ.4.80 కోట్ల ఆదాయం సమకూరుతుంది.

మూడేళ్లకోసారి 33 శాతం పెంచేలా..

మున్సిపల్ కాంప్లెక్స్‌లోని షాపులకు ప్రతి మూడేళ్లకోసారి 33 శాతం అద్దె పెంచాలి. దీనికి 18 శాతం జీఎస్టీ అదనం. అలాగే షాపు పాడుకున్న వ్యక్తి రెన్యూవల్ చేయించుకోవాలి. షాపు సర్వే నంబర్లను బట్టి కంప్యూటర్‌లో ఆటోమేటిక్‌గా అద్దెల పెంపుదల జరుగుతుంది. అయితే ఇక్కడ కార్పొరేషన్ సిబ్బంది మాయాజాలం కారణంగా కంప్యూటర్లను కూడా మేనేజ్ చేసేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. షాపుల కేటాయింపులో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులు, ఓసీ కేటగిరీల వారీగా అద్దెలు నిర్ణయిస్తారు. షాపుల అద్దెలు సైతం సర్వే నంబర్ల ఆధారంగా వేర్వేరుగా ఉంటాయి. బిర్లా భవన్ సెంటర్‌లోని మూడు వైపులా ఉన్న మున్సిపల్ షాపుల్లో మూడు రకాలుగా అద్దెలు ఉండటమే దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

ప్రజాప్రతినిధి అనుచరుడికి రెండు షాపులు

ఇటీవల ఓ మున్సిపల్ కాంప్లెక్స్‌లో బేకరీ, హోటల్ షాపులు ఖాళీ అయ్యాయి. వీటిని ప్రజాప్రతినిధి అనుచరుడికి కేటాయించినట్టు తెలిసింది. సదరు వ్యక్తి ఆ రెండు షాపులను సబ్ లీజుకు ఇచ్చేశారు. ఇదే ప్రజాప్రతినిధి మరో అనుచరుడు ఒకరు ఏకంగా మున్సిపల్ ఆఫీస్ గోడను పగులగొట్టి బిర్యానీ పాయింట్ రూమ్‌ను లోపలకు విస్తరించారు. అయినా కార్పొరేషన్ అధికారులు ఏ ఒక్కరూ నోరు మెదపకపోవడం విశేషం.

మద్యం షాపు ఏర్పాటుపై విమర్శలు

బిర్లాభవన్ సెంటర్ నుంచి కల్పనా థియేటర్‌కు వెళ్లే మార్గంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లోని రెండు షాపుల్లో మద్యం దుకాణం ఏర్పాటుచేయడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై మున్సిపల్ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు వెళ్లాయి. వేరే వారి పేరుతో ఉన్న ఆ రెండు షాపులను వైన్స్ షాపుదారుడికి సబ్ లీజుకి ఇచ్చినట్టు తెలిసింది. మున్సిపల్ కాంప్లెక్స్‌లలో మద్యం షాపులను ఏర్పాటు చేయకూడదనే నిబంధనలు ఉన్నా భేఖాతరు చేశారు.

రూ.45 వేల అద్దెను రూ.18 వేలకు కుదించి..

ఏలూరు చందనా బ్రదర్స్ సెంటర్‌లోని కస్తూరిబా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్‌లోని నెం.2 షాపు కేటాయింపు కూటమి నేతల అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ షాపు 15 ఏళ్లుగా టీడీపీ నేత మామిళ్లపల్లి పార్థసారథి పేరున నెలకు రూ.45 వేల అద్దెపై ఉంది. పార్థసారథి కీలక నేత కావడంతో కొత్త అంశానికి తెరతీశారు. గుట్టుచప్పుడు కాకుండా ఈ షాపును ఖాళీ చేసి మరలా వేలం వేసేలా పావులు కదిపారు. ఈనెల 17న బహిరంగ వేలంలో ముగ్గురు టెండర్లు వేశారు. అయితే వీరంతా సదరు నేత కుమారుడు, అనుయాయులు కావడం విశేషం. హెచ్చు మొత్తం నెలకు రూ.18 వేల అద్దెకు టెండర్ వేసిన మామిళ్లపల్లి నందగోపాల్‌కు షాపును కేటాయించారు. ఇలా షాపును తండ్రి పేరు నుంచి కుమారుడికి బదలాయించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం నెలకు రూ.49,065 అద్దె నిర్ణయించగా రూ.18 వేల కే ఖరారు చేయడం ద్వారా కార్పొరేషన్ ఆదాయానికి నెలకు రూ.31,065 గండి పడింది. మున్సిపల్ చట్టం ప్రకారం ఉన్న అద్దె కన్నా ఎక్కువకే టెండర్ ఖరారు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు.

మద్యం షాపు విడ్డూరం



మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఏకంగా మద్యం షాపును ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎటువంటి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలకు షాపులను అద్దెకు ఇవ్వకూడదనే నిబంధనలు ఉన్నా వాటిని భేఖాతరు చేస్తూ షాపులను కేటాయించడం బాధాకరం. దీనిపై మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– బి.సోమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏలూరు

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కాపవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధికంగా మంగమ్మతల్లి దర్శనానికి రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయ కమిటీ వారు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేట్టారు.

పెద్దింట్లమ్మకు ప్రత్యేక పూజలు



కొల్లేటికోట పెద్దింట్లమ్మ

కై కలూరు: కొల్లేటి పెద్దింట్లమ్మా.. నీ చల్లని దీవెనలు మా కుటుంబాలకు అందించమ్మా.. అంటూ భక్తులు అమ్మవారిని ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మను సమీప జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మకు పొంగళ్లు, వేడి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను సమర్పించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం రోజున ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, పెద్ద, చిన్న తీర్థాలు, కేశఖండన, గదుల అద్దెలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, అమ్మవారి చిత్రపటాలు విక్రయాలతో కలిపి మొత్తంరూ. 62,073 ఆదాయం వచ్చిందని తెలిపారు.

నేడు మిగులు భూముల సమస్యపై పోరు

ఏలూరు (టూటౌన్): ఎర్ర క్రాలువ మిగుల భూముల సమస్యపై టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం మండలాల పరిధిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో సోమవారం జరిగే పర్యటన జయప్రదం చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మిగులు భూములను ఇంకా ఇప్పటికీ అక్రమంగా భూస్వాములే అనుభవిస్తున్నారని విమర్శించారు. ఆ ప్రాంతాల్లో పామాయిల్, జామాయిల్, మొక్కజొన్న, కొబ్బరి పంటలు వేసి వచ్చిన ఫలసాయాన్ని నేటికి అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఒకసారి ప్రభుత్వానికి భూములు అమ్మి నష్టపరిహారం తీసుకున్న తర్వాత ఎట్టి పరిస్థితులలో భూములపై హక్కు ఉండదని, అలాంటి భూములను సాగు చేసి ఫలసాయం పొందడం చట్ట విరుద్ధమని అన్నారు. రిజర్వాయర్ మిగులు భూములు దాదాపుగా 3500 ఎకరాలు ఉన్నాయని, ఆ భూములను ప్రభుత్వ స్వాధీనం చేసుకొని భూమిలేని దళితులు, గిరిజనులు, పేదలకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ సమస్యపై సీపీఎం గత 10 సంవత్సరాల నుంచి పోరాటం సాగిస్తుందని తెలిపారు. స్థానిక దళితులు, గిరిజనులు, పేదలకు అండగా నిలబడేందుకు, హైకోర్టు తీర్పు ఆధారంగా సాగుచేసుకోమని చెప్పడానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, ఇతర జిల్లా నాయకులు సోమవారం టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లోని ఎర్రక్రాలువ మిగులు భూముల్లో పర్యటన జరిపి, దున్ని, సాగు చేసే కార్యక్రమాన్ని చేపడతారన్నారు.

కంప్యూటర్ సైన్స్‌కే మొగ్గు

- సీఎస్ఈ, అనుబంధ బ్రాంచుల్లో సీటు రాకపోతేనే మిగతా కోర్సుల వైపు చూపు
- ఈ నెల 30 వరకూ రెండో విడత కౌన్సెలింగ్



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంజినీరింగ్‌లో కంప్యూటర్స్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. చదువుతుండగానే ఉద్యోగాలు పొందే అవకాశాలు కేవలం కంప్యూటర్ కోర్సుల ద్వారా మాత్రమే రావడంతో ఆ కోర్సులు కౌన్సెలింగ్‌లో హాట్ కేకుల్లా అయిపోతున్నాయి. సీఎస్ఈలో సీటు రాదని తెలిస్తేనే విద్యార్థులు మరో బ్రాంచ్ వైపు దృష్టి సారిస్తున్నారు. ఇటీవల జరిగిన ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో ఇప్పటికే యాజమాన్య కోటా సీట్లు మొత్తం భర్తీకాగా తొలి విడత కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌లో జిల్లాలో ఉన్న 6 ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ సీఎస్ఈ బ్రాంచ్ సీట్లు పూర్తిగా భర్తీ అయిపోయాయి.

విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని గుర్తిస్తున్న ఆయా సంస్థలు విద్యార్థులు మూడో సంవత్సరం పూర్తి చేయగానే క్యాంపస్ సెలక్షన్లు, లేదా ఆన్‌లైన్ టెస్టులు నిర్వహించి వారిని తమ ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నాయి. ఆయా సంస్థల ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా జాబ్ మార్కెట్ ట్రెండ్‌కు అనువుగా కంప్యూటర్ సైన్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ), బ్లాక్ చైన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్, డైటా సైన్స్ వంటి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. వీటికి దేశ విదేశాల్లో అపార ఉద్యోగ అవకాశాలు ఉండడంతో విద్యార్థులు ఈ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు. భవిష్యత్‌లో సీఎస్ఈ అనుబంధ కోర్సులైన ఏఐ, ఐఓటీ, డీఎస్, ఎంఎల్ వంటి ప్రత్యేక కోర్సులు చేసిన వారికే ఎక్కువ అవకాశాలు అందివచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

కంప్యూటర్ కోర్సులకు లక్షల్లో ప్యాకేజీలు

కంప్యూటర్ ఆధారిత కోర్సులు పూర్తి చేసిన వారికి వివిధ బహుళ జాతి సంస్థలు లక్షల్లో జీతాలు ఆఫర్ చేస్తున్నాయి. సీఎస్ఈ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన వారికి ప్రారంభ ప్యాకేజీ రూ.4 లక్షలుగా ఉంటోంది. టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్, మైక్రోసాఫ్ట్, టెక్ మహీంద్ర, ఐబీఎం వంటి కంపెనీలు విద్యార్థుల కోసం క్యూ కట్టడంతో డిమాండ్ పెరిగిపోయింది. నగరంలోని సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 2021–25 విద్యా సంవత్సరంలో ఏఐ డీఎస్ పూర్తి చేసిన విద్యార్థినికి అమెజాన్ రూ. 46.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం ఆఫర్ చేయడం విశేషం. ఏలూరు జిల్లాకు చెందిన వివిధ కళాశాలల విద్యార్థులు సైతం రూ.10 లక్షలకు పైగా ప్యాకేజీతో ఉద్యోగాలు సంపాదించారు.

30 వరకూ రెండో దశ కౌన్సెలింగ్

మొదటి దశలో సీటు పొందిన విద్యార్థులకు ఇప్పటికే సీట్ల కేటాయింపులు జరిగిపోవడంతో వారిలో 95 శాతానికి పైగా సీటు పొందిన కళాశాలల్లో రిపోర్ట్ చేశారు. మొదటి విడత కౌన్సిలింగ్‌లో తమకు ఆశించిన కళాశాలల్లో సీటు రాని మిగిలిన 5 శాతం మంది రెండో దశ కౌన్సెలింగ్‌కు వెళ్ళడానికి సిద్ధపడుతున్నారు. మొదటి దశలో సీటు పొందిన కళాశాలలో సదరు విద్యార్థి రిపోర్టు చేయకుంటే ఆ సీటు రద్దయ్యి, రెండో విడత కౌన్సిలింగ్‌లో ఏ కళాశాలలో సీటు కేటాయిస్తే ఆ కళాశాలలోనే తప్పనిసరిగా చేరాల్సిన పరిస్థితి.

రెండవ దశ కౌన్సెలింగుకు ఈ నెల 27 నుంచి షెడ్యూల్ విడుదల చేశారు.

27 నుంచి 30 వరకూ రిజిస్ట్రేషన్
28 నుంచి 30 వరకూ సర్టిఫికెట్ల అప్‌లోడ్
28 నుంచి 31 వరకూ వెబ్ ఆప్షన్లు
ఆగస్టు 1న వెబ్ ఆప్షన్ల మార్పు
ఆగస్టు 4న సీట్ల కేటాయింపు
ఆగస్టు 8న రిపోర్ట్ చేయడానికి తుది గడువు

కంప్యూటర్ సైన్స్‌కు పెరుగుతున్న ఆదరణ



ఈ ఏడాది సీటు పంపిణీ వివరాలను పరిశీలిస్తే, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, దాని అనుబంధ విభాగాలకు విద్యార్థుల నుంచి మంచి ఆదరణ కనిపిస్తోంది. ఇతర ప్రధాన ఇంజినీరింగ్ శాఖలు కూడా గత సంవత్సరంతో పోల్చితే మెరుగైన స్థాయిలో భర్తీ కావడం సానుకూల పరిణామంగా చెప్పవచ్చు. సమాజంలో వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాల దృష్ట్యా అన్ని ఇంజినీరింగ్ కళాశాలలు విద్య నాణ్యతను మెరుగుపరచుకోవాలి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి తాజా సాంకేతిక రంగాల్లో నవీకరణలు తీసుకురావాలి. ఇంజినీరింగ్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు తమ రెగ్యులర్ సబ్జెక్టులతో పాటు తాజా సాంకేతికతలపై సర్టిఫికేషన్ కోర్సులు కూడా చేయడం అత్యంత అవసరం.

–డాక్టర్ మర్లపల్లి కృష్ణ, సీఎస్ఈ ప్రొఫెసర్, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల

రాట్నాలమ్మకు రూ.1,16,385 ఆదాయం

పెదవేగి: ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలోని రాట్నాలమ్మను దర్శించుకునేందుకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా భక్తులు చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు, నూతన వస్త్ర బహూకరణలు, నామకరణలు చేశారు. ఈ వారం అమ్మవారికి పూజా రుసుం వలన రూ 71,400, విరాళాలుగా రూ10,245, లడ్డూ ప్రసాదంతో రూ30,390, పులిహోర అమ్మకంతో రూ.1035, ఫొటోల అమ్మకంతో రూ.3,315, మొత్తం రూ.1,16,385 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు.

విద్యుత్ దీపాలకు రూ.4.23 లక్షల అందజేత



విరాళం అందిస్తున్న శ్రీరామరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కాలినడక వెళ్లే భక్తుల కోసం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున రూ.4.23 లక్షలు విద్యుత్ దీపాల ఏర్పాటుకు అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు అందించారు. ఇటీవల ఒక భక్తుడు పాము కాటుకు గురయ్యాడని తెలవడంతో మిల్లర్స్ అసోసియేషన్ సామాజిక సేవా సంస్థ నుంచి ఈ మొత్తం అందించారు.

అభివృద్ధి ముసుగులో మట్టి దందా

- తక్కెళ్లపాడులోని లక్ష్మీపురం చెరువులో మట్టి తవ్వకాలు
- జోరుగా సాగుతున్న పచ్చనేతల మట్టి వ్యాపారం



ద్వారకాతిరుమల మండలం తక్కెళ్లపాడులోని లక్ష్మీపురం చెరువులో మట్టి తవ్వకాలు

ద్వారకాతిరుమల: కొందరు పచ్చనేతలు మట్టినే వ్యాపారంగా ఎంచుకున్నారు. చెరువులు, కాలువ గట్లకు తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా మట్టి దందాను సాగిస్తున్నారు. ట్రాక్టర్‌కు, టిప్పర్‌కు ఇంత రేటని ఫిక్స్‌చేసి, అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ద్వారకాతిరుమల మండలం తక్కెళ్లపాడులోని లక్ష్మీపురం చెరువులో గత నెల రోజులుగా ఈ మట్టి వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. లక్ష్మీపురం చెరువు సుమారు 57 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. పి.కన్నాపురంలోని ఓ ప్రైవేటు పరిశ్రమ ఈ చెరువును అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. గత నెల రోజుల క్రితం నుంచి రెండు పొక్లెయిన్‌లతో మట్టి తవ్వకాలను జోరుగా సాగిస్తోంది. వర్షాల కారణంగా మూడు రోజులపాటు నిలిచిపోయిన ఈ పనులు తిరిగి ఆదివారం ప్రారంభమయ్యాయి. వాస్తవానికి తవ్విన మట్టితో చెరువుకు గట్లు వేయాల్సి ఉంది. కొందరు టీడీపీ నేతలు ఆ మట్టిని అమ్ముకుని, వచ్చిన సొమ్ములతో జేబులు నింపుకుంటున్నారు. వీరిని చూస్తున్న ప్రజలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ఇందుకా.. అని ముక్కున వేలేసుకుంటున్నారు.

లోకల్‌కు ఓ రేటు.. నాన్ లోకల్‌కు ఓ రేటు

తక్కెళ్లపాడు పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌కు రూ. 200కు, పక్క పంచాయితీలకు చెందిన ట్రాక్టర్‌కు రూ.1,000కు మట్టిని విక్రయిస్తున్నారు. టిప్పర్‌కు రూ. 3,500కు మట్టిని అమ్ముతున్నారు. చెరువులోకి వచ్చే ట్రాక్టర్, టిప్పర్ల యజమానుల నుంచి ఈ సొమ్ములను టీడీపీ నేతలు వసూలు చేసి, జేబులో వేసుకుంటున్నారు. ట్రాక్టర్, టిప్పర్ల యజమానులు ఆ మట్టిని తీసుకెళ్లి తమకు నచ్చిన రేటుకు అమ్ముకుంటున్నారు. బహిరంగంగా ఇంత జరుగుతుంటే అధికారులు తమకేమీ తెలియనట్టు నిద్ర నటిస్తున్నారు. కాసులు అందుకుని నిమ్మకుండిపోయారో.. లేక నేతల బెదిరింపులకు లొంగిపోయారో తెలియడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పక్కదారి పడుతున్న ప్రజాధనాన్ని ప్రభుత్వానికి జమ చేయాలని పలువురు కోరుతున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘానికి ఎమ్మెల్సీ కేటాయించాలి

ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘం డిమాండ్



స్వర్ణకార సంఘ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దార్ల పాపాయాచార్యులు

ఆకివీడు: రాష్ట్రంలో స్వర్ణకార వృత్తి అగమ్యగోచరంగా ఉందని, వృత్తిదారులు పనులు లేక రోధిస్తున్నారని స్వర్ణకార సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దార్ల పాపాయాచార్యులు ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక రైస్‌మిల్లర్స్ భవనంలో ఆదివారం ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘం విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వర్ణకారులు రాజకీయంగా ఎదగాలన్నారు. విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి రూ.100 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. బ్యాంకుల్లో అప్రైజర్లుగా అనుభవం కలిగిన స్వర్ణకారుల్నే నియమించాలని డిమాండ్‌చేశారు. తిరుమల తిరుపతి, ఇతర దేవస్థానాల్లో ట్రస్టుబోర్డు సభ్యులుగా విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అన్ని రంగాల్లో స్వర్ణకారులు ముందుండాలని, వృత్తి నైపుణ్యత సాధించాలన్నారు. ప్రభుత్వం వృత్తిదారులకు పనిముట్లు అందజేసేకన్నా, పని కల్పించడంలో ప్రాధాన్యతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాల ప్రాధాన్యతను పెంచాలన్నారు. మట్టె, మాంగళ్యం వంటివి స్వర్ణకారుల ద్వారానే తయారుచేయించాలన్నారు. ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘ అధ్యక్షుడు పట్నాల శేషగిరిరావు మాట్లాడుతూ స్వర్ణకారుల్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్పొరేట్ సంస్థల రంగప్రవేశంతో స్వర్ణకారులకు పనులు లేకుండా పోయాయని వాపోయారు. రెడీమేడ్ ఆభరణాలు రాజ్యమేలడంతో స్వర్ణకారులు చితికిపోతున్నారన్నారు. బంగారం ధరలు రోజు రోజుకూ ఆకాశాన అంటుతుంటే వృత్తిదారులు మాత్రం పాతాళానికి వెళ్తున్నారని వాపోయారు. సమావేశంలో సీనియర్ స్వర్ణకారుల్ని, విశ్వబ్రాహ్మణుల్ని సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కీర్తి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి నల్లగొండ వెంకట రామకృష్ణ, లక్కోజు వెంకట దుర్గా నాగేశ్వరరావు, దేవు వెంకటేశ్వర ప్రసాద్, పట్నాల సత్యనారాయణ, లక్కోజు రాజగోపాలాచార్యులు, పోడుగు రామాచార్యులు, గొల్తి వరప్రసాద్, కోరుమిల్లి సుబ్బారావు, నక్కా చైతన్య శ్రీనివాస్, తుపాకుల సోమాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీనియర్లను, జిల్లా కమిటీని సత్కరించారు.

పరీక్షా కేంద్రం మార్పుతో గందరగోళం



పెనుగొండ కళాశాల వద్ద కాంట్రాక్టు పోస్టుల కోసం పరీక్షకు హాజరైన అభ్యర్థులు

పెనుగొండ: ఎయిడెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థుల భవిష్యత్తుతో విద్యా శాఖ ఆడుకుంటోంది. ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్షలో గందరగోళం నెలకొంది. పెనుగొండ సెంటర్‌కు వచ్చిన తరువాత సెంటరు మార్పు చేయడంతో పెనుగొండ కళాశాల గేటు వద్ద అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. సమన్వయ లోపంతో సుమారు 50 మంది అభ్యర్థులు పరీక్షకు దూరమయ్యారు. పెనుగొండలోని ఎస్వీ కేపీ అండ్ కోట్ల వెంకట్రామయ్య బాలికోన్నత పాఠశాలలో మూడు సంవత్సరాల కాంట్రాక్టు ఉపాధ్యాయులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 7 పోస్టులకు 1400 మంది దరఖాస్తు చేసుకొన్నారు. వీరిలో 912 మందిని అర్హులుగా గుర్తించారు. వారికి టెస్ట్ నిర్వహించడానికి ఈ నెల 15న జిల్లా విద్యాశాఖాధికారి పెనుగొండలోని ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి అనుగుణంగా పాఠశాల నుంచి అర్హులైన వారికి హాల్ టికెట్లు జారీ చేశారు. అకస్మాత్తుగా పరీక్షా కేంద్రాలను మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు. భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, డీఎన్ఆర్ కళాశాలలో రెండు సెంటర్లు, తాడేపల్లిగూడెంలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో, శశి ఇంజనీరింగ్ కళాశాలకు మార్పు చేశారు. ఈ సమాచారం కొందమందికి మాత్రమే అందింది. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా దరఖాస్తు చేసుకొన్న వారికి ఎలాంటి సమాచారం లేకుండా పోయింది.

పెనుగొండలోని ఎయిడెడ్ పాఠశాలకు ఎలాంటి సమాచారం లేదు. అభ్యర్థులలో కొందరు మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకోవడంతో మూడు స్లాట్లలో పరీక్షలు ఏర్పాటు చేశారు. అయితే, పరీక్షా సమయం కావస్తున్నా విద్యాశాఖాధికారులు రాకపోవడంతో అనుమానం వచ్చి సంప్రదిస్తే పరీక్షా కేంద్రం మార్పు చేశారని చెప్పారు. అప్పటికే కేంద్రానికి 50 మందికి పైగా అభ్యర్థులు చేరుకున్నారు. ఎలాంటి సమాచారం అందించకుండా మార్పు ఎలా చేశారంటూ నిరశన వ్యక్తం చేశారు. విద్యాశాఖాధికారులు పోస్టులను బేరం పెట్టారని, అందుకే పరీక్ష నిర్వహణలో గందరగోళం సృష్టించారని ఆరోపించారు.

నాలుగు ఆలయాల్లో చోరీ



పత్తేపురంలో హుండీ పగుల గొట్టిన దృశ్యం

నిడమర్రు: మండలంలోని నాలుగు ఆలయాల్లో డిబ్బీల్లో నగదు చోరీకి గురైంది. నిడమర్రు ఎస్సై వీర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం అర్ధరాత్రి పత్తేపురంలో మూడు దేవాలయాల్లో, పెదనింద్రకొలను గ్రామంలోని ఒక దేవాలయంలోని డిబ్బీలు పగలు గొట్టి నగదు దోచుకున్నట్లు తెలిపారు. ఈ నాలుగు దేవాలయాలను స్థానిక ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పత్తేపురంలో పత్తేపురం– పెదనింద్రకొలను ఆర్ అండ్‌బీ రోడ్డు మార్గంలోని శ్రీకృష్ణుడి ఆలయం, గ్రామ ప్రధాన మంచినీటి చెరువు వద్ద నిర్మించిన శ్రీ అంజనేయ విగ్రహ ఆలయం, వినాయక స్వామి ఆలయం, పెదనింద్రకొలను గ్రామంలోని తూర్పుపేట వినాయకుడి గుడి వద్ద ఉన్న డిబ్బీల్లోని నగదు చోరీకి గురైంది. కమిటీల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాలకు వెళ్లి పరిశీలించి కేసు నమోదు కేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు. అందుబాటులో ఉన్న సీసీ ఫుటేజ్ పరిశీలనలో శనివారం అర్ధరాత్రి దాటాక 25 నుంచి 30 సంవత్సరాలన్న ముగ్గురు యువకులు పల్సర్ బైక్ పై వచ్చి ఈ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

కువైట్‌లో నా భార్యను నిర్బంధించారు..



భార్య కోసం ఎదురుచూస్తున్న భర్త వెంకటరమణ, పిల్లలు

కొయ్యలగూడెం: కువైట్‌లో చిక్కుకుపోయిన తన భార్యను రక్షించాలని బయ్యనగూడెం గ్రామానికి చెందిన మర్రిపూడి వెంకటరమణ కోరుతున్నాడు. వెంకటరమణ భార్య సుమ ఉపాధి నిమిత్తం మూడు నెలల క్రితం కువైట్ వెళ్ళింది. వెంకటరమణ వెన్నెముక దెబ్బ తినడంతో కుటుంబ పోషణ నిమిత్తం సుమ కువైట్‌లోని క్లీనింగ్ పనులకు చేరింది. రెండు నెలల నుంచి తీవ్ర అనారోగ్యంతో ఆమె బాధపడుతోంది. దీంతో సుమను కువైట్‌కి పంపిన భీమవరంలోని ఏజెంట్‌ను సంప్రదించగా రూ.1.50 లక్షలు కడితే సుమను ఇండియాకి తీసుకువస్తానని చెప్పాడు. తన భార్య వద్ద ఫోన్‌ను తీసుకుని మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని, వేరొకరి ఫోన్ నుంచి సమాచారం అందజేసిందన్నారు. ప్రభుత్వం తన భార్యను క్షేమంగా ఇండియాకు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని రమణ కోరుతున్నాడు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

కాళ్ల: రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని రాష్ట్ర సర్పంచుల సంఘ ఉపాధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత 8 నెలల కాలంగా కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన రూ.1,120 కోట్ల నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాంపు డ్యూటీలో పంచాయతీల వాటాను గతంలో 3 నెలలకోసారి విడుదల చేసేవారని గుర్తు చేశారు. గత ఏడాదిగా ప్రభుత్వం ఆ సొమ్మును సొంత అవసరాలకు వాడుకోవడం చాలా దారుణమన్నారు. పంచాయతీలను ఉద్ధరిస్తానని వాగ్దానం చేసిన పంచాయతీ రాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ సినిమాల బిజీలో పడి మమ్మల్ని మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన అంజలి

కొయ్యలగూడెం: క్షణికావేశంలో ఉరివేసుకుని వివాహిత ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. సర్పంచ్ కడకట్ల గడ్డియ్య తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యలగూడెం మండలం బోడిగూడెం గ్రామానికి చెందిన ఆవూరి అంజలి(18)కి అదే గ్రామానికి చెందిన ఆవూరి వెంకట కల్యాణ్‌తో ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం జరిగింది. అంజలికి తల్లిదండ్రులు లేకపోవడంతో పెద్దమ్మ దగ్గర ఉంటూ చదువుకునేది. అదే గ్రామానికి చెందిన కల్యాణ్ అంజలిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇటీవల అంజలికి, కల్యాణ్‌కు మనస్పర్థలు రావడంతో పెద్దల సమక్షంలో పరిష్కరించారు. ఆషాఢ మాసం కావడంతో అంజలి పెద్దమ్మ ఇంటికి వచ్చింది. ఆషాఢం పూర్తయిన సందర్భంగా భార్యను తీసుకు వెళ్ళమని కళ్యాణ్‌కు అంజలి పుట్టింటి వారు కబురు పంపగా మీరే తీసుకువచ్చి దింపాలన్నాడు. దీంతో మనస్థాపానికి గురైన అంజలి ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందిందని తెలిపారు. పోలవరం సీఐ బాల సురేష్‌బాబు, ఎస్సై చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



మృతురాలు రంగమ్మ

మండవల్లి: కుటుంబ సభ్యులతో మాట మాట పెరిగి మనస్తాపంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అయ్యవారిరుద్రవరంలో ఆదివారం జరిగింది. మండలంలోని అయ్యవారిరుద్రవరానికి చెందిన రంగమ్మ(45) భర్త పిల్లలతో కలిసి జీవిస్తుంది. కుటుంబ సభ్యులు ఆమెను కూలి పనులకు వెళ్ళవద్దని ఇంటివద్దనే ఉండమని చెప్పారు. దీంతో రంగమ్మ మనస్తాపంతె పందికొక్కుల టాబ్లెట్లు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ లీక్

కైకలూరు: కైకలూరు మండలం తామరకొల్లులో నున్న మంగరాజు ఇంట్లో ఆదివారం గ్యాస్ స్టౌవ్ వెలిగించగా లీకై మంటలు వ్యాపించాయి. భయపడి సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చారు. మట్టితో కప్పినా మంటలు అదుపులోకి రాలేదు. కైకలూరు ఫైర్ సిబ్బందికి హుటాహుటీన వచ్చి మంటలను అదుపుకున్నారు. ఫైర్ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

క్లుప్తంగా

ఇంటింటికీ ఉచిత వైద్యం



ఉచిత వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ వైద్యసేవలు అందించారు. తణుకు, వేల్పూరు ప్రాంతాల్లో ప్రత్యేక వాహనం ద్వారా పర్యటించి 10మంది వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు అతికాల ప్రసాదరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

కవి ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం



తెనాలిలో ఉత్తమ కవితా పురస్కారం అందుకున్న కవి ప్రసాద్

తణుకు అర్బన్: మహాకవి గుర్రం జాషువా వర్ధంతి పురస్కరించుకొని ఈ నెల 24న తెనాలిలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో తణుకుకు చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ చూపించిన కవితా ప్రతిభకు ఉత్తమ పురస్కారం దక్కింది. తాను రచించి, చదివి వినిపించిన రక్షించుకుందాం మహిళా జగతిని అనే కవితకు విశేష స్పందన లభించినట్లు కవి ప్రసాద్ తెలిపారు. ఈ సదర్భంగా గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ వ్యవస్థాపకులు డాక్టర్ పెద్దింటి యోహాన్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ దేవులపల్లి ప్రభుదాస్, గురిందపల్లి సుజ్ఞానరాజు, విజయరావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు వివరించారు. శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించినట్లు చెప్పారు.

తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాస్కరరావు

తణుకు అర్బన్: తల్లిదండ్రుల దినోత్సవాన్ని స్థానిక హెడ్ పోస్టాఫీసు కార్యాలయ ఆవరణంలో ఆదివారం సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ మానవ జీవితంలో ప్రత్యక్ష దైవాలు తల్లిదండ్రులేనని, ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులతో గౌరవ పూర్వకంగాను, ప్రేమాభిమానాలతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మాజీ అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు, గంగాకుమారి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మంగు సూర్యప్రకాష్, మారాల సురేష్, కసిరెడ్డి శివప్రసాద్, బేతా వరలక్ష్మి, బందల సుధారాణి పాల్గొన్నారు.

ఈనాం భూములకు చట్టబద్ధత కల్పించాలి

పెనుగొండ: ఈనాం భూములకు చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించినట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షా 68 వేల ఎకరాలు ఈనాం భూములు ఉండగా, ఐదు లక్షల మంది హక్కుదారులు ఉన్నారన్నారు. వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నపుడు భూమిని అమ్ముకోవడానికి లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. రిజిస్ట్రేషన్లు కావడం లేదని, సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, ఏడుకొండలు, బాబీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉండి: పాములపర్రులో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాములపర్రు శివారు రామాపురంలో ఉండి వైపు నుంచి గణపవరం వైపు వెళుతున్న వ్యాన్ ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి అనంతరం పాదచారుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో పాదచారుడు సప్పా సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలు కాగా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న రామకూరి వెంకటేశ్వరరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల వేతన వెతలు

- ధర్మాసుపత్రిలో కార్మికులకు అందని వేతనాలు
- నాలుగు నెలల వేతనాలు పెండింగ్
- పారిశుధ్య కార్మికులు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల రోదనలు
- కార్మికులను ఉసురుపెడుతున్న కూటమి ప్రభుత్వం



తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

తణుకు అర్బన్: సర్కారు దవాఖానాల్లో విశేష సేవలందిస్తున్న కార్మికులకు వేతనాలివ్వడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. నిత్యం ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వారి రక్షణకు నిఖార్సుగా అందుతున్న సేవలు అల్లాడుతున్నాయి. శుభ్రత, భద్రత, క్షేమంగా ఇంటికి చేర్చే రంగాల్లో వారు అందిస్తున్న సేవలు అజరామజరంగా నిలుస్తున్నా, కూటమి ప్రభుత్వం మూడు పూటలా కడుపు నిండా నాలుగు మెతుకులు మనస్ఫూర్తిగా తినే అవకాశం ఇవ్వడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలే చాలీచాలని వేతనాలు అవి కూడా ఏ నెల వేతనం ఆ నెల అందడం లేదంటూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 150 బెడ్లతో వైద్య సేవలు అందిస్తున్న తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నిత్యం 500 లకు పైగా ఓపీ నమోదవుతుండగా 18 మంది కార్మికులు విధుల్లో ఉండి సేవలు అందిస్తున్నారు.

అల్లాడుతున్న కార్మికులు

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా గతం నుంచి రోగులకు సత్వర సేవలందుతున్నాయి. కానీ నేడు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్య కార్మికులకు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో కుటుంబాలను పోషించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. జీతం రాకపోయినా ఖర్చులు తప్పవు కదా అనే ఉద్దేశ్యంతో ఇళ్లు గడిపేందుకు అప్పులు చేస్తున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో వచ్చే వ్యర్థాలతో పాటు పలు వార్డుల్లో వచ్చే వ్యర్థాలను తొలగించడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకంగా పనిచేస్తుంటారు. ఆసుపత్రిలో ప్రసవాల అనంతరం తల్లీబిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చడంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు సత్వర సేవలు అందిస్తుంటారు. అరకొర వేతనంతోనే విధులు నిర్వహిస్తూ బాలింతలను సురక్షితంగా ఇంటికి చేరుస్తూ వారి ప్రశంసలు పొందుతున్నారు. గత ఐదేళ్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా నడిచిన ఈ సేవలు నేటి కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి వారి జీవనోపాధి కుంటుపడిన పరిస్థితులు కనిపిస్తున్న దుస్థితి. ఇప్పటికే నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండగా ఈ నెల కూడా గడిస్తే 5 నెలలు బకాయిలు పడనున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లు అల్లాడిపోతున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉన్న 5 వాహనాల్లో ప్రస్తుతం పడుతూ లేస్తూ 3 వాహనాలు మాత్రమే తిరుగుతున్నాయి.

ఏం తినమంటారు



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ వేతనానికి విధులు నిర్వహిస్తున్నారు. ఆ వేతనం కూడా ఏ నెల వేతనం ఆ నెలలో ఇవ్వకుండా నెలల తరబడి బకాయిలు పెట్టి వారిని అప్పుల పాలు చేస్తున్నారు. ఇచ్చే జీతాలు సరిపోకపోయినా ఏదైనా మంచి రోజులు వస్తాయేమోననే ఆశతో కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులను పస్తులు పెట్టేలా ప్రభుత్వం తీరు కనిపిస్తోంది. కార్మికుల ఆకలి కేకలు పట్టించుకోని ప్రభుత్వాలకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– కోనాల భీమారావు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు

మానవత సేవలు అభినందనీయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత ప్రతినిధులు

తణుకు అర్బన్: పలు అవసరాలతో ఇబ్బందుల్లో ఉన్న వారికి మానవత్వంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని మానవత జిల్లా శ్యాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు అన్నారు. తణుకు గమిని ఫంక్షన్ హాలులో సంస్థ అధ్యక్షుడు కడించర్ల రాజరాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన నెలవారీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కృత్రిమ కాలు ఏర్పాటు నిమిత్తం వాకాటి నాగలక్ష్మికి రూ.5 వేలు హైదరాబాద్ ప్రయాణ ఖర్చులకు, ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఎ.అమృతకు రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మానవత జిల్లా కన్వీనర్లు వి.సతీష్‌బాబు, బోయపాటి రామలక్ష్మి, రామకృష్ణ, విశిష్ట దాత చిట్టూరి సుజాత, కఠారి శారదాదేవి, కఠారి విశ్వనాధరాజు, ఆనందం మస్తాన్‌రావు, బి.రామకాశీ, మాకిరెడ్డి రామ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కొమ్మర గ్రామ సచివాలయం వద్ద గ్లోబల్ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి సౌజన్యంతో దత్తత గ్రామాలైన కొమ్మర, మంచిలి, పాలూరు, ఈడూరు, కంచుమర్రు గ్రామాలకు చెందిన వారికి ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్రాలయ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 12 మందిని ఉచితంగా శస్త్ర చికిత్సల నిమిత్తం తరలించారు. 94 మందికి ఉచితంగా కళ్లజోళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. నిర్వాహకులు కునాధరాజు శ్రీహరిరాజు, మంతెన గోపాలకృష్ణన్ రాజు, మంతెన ధర్మతేజ వర్మ, మంతెన శ్రీ రామ మూర్తి రాజు పాల్గొన్నారు.

బల్లిపాడులో..

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ మాజీ గవర్నర్ మాతిరెడ్డి బాపూజీ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 72 మందిని పరీక్షించారు. 19 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 13 మందికి ఐఓఎల్ ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. మాజీ గవర్నర్ బాపూజీ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. జోన్ చైర్మన్ పట్నాల బాబు, క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ బాలమురళీకృష్ణ, కోశాధికారి వర్ధినీడి శివ పాల్గొన్నారు.



ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేడు తణుకులో..

తణుకు అర్బన్: ప్రముఖ పారిశ్రామికవేత్త ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ జయంతి సందర్భంగా తణుకు ముళ్లపూడి వెంకటరమణమ్మ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో సోమవారం మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఉచిత వైద్యశిబిరంలో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆప్తమాలజీ, డెంటల్, యూరాలజీ, నెఫ్రాలజీ, పల్మనాలజీ, న్యూరాలజీ, ఈఎన్‌టీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, నార్కొలజీ, ఫిజియోథెరపీ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తునట్లు వివరించారు.

ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం

తాడేపల్లిగూడెం రూరల్: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. మండలంలోని పడాల మార్కెట్ యార్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా చాపల మంగాబాయి, వైస్ చైర్మన్‌గా ముత్యాల వీర వెంకట సత్యనారాయణ, ఎక్స్ అఫిషియో సభ్యునితోపాటు మరో 13మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, భవన, ఇతర నిర్మాణ కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, డీసీఎంఎస్ చైర్మన్ సీహెచ్ మురళి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఏఎంసీ పాలకవర్గంలో బీజేపీ నుంచి ఎవరికీ ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై తాతాజీ వేదికపై మాట్లాడుతూ అసంతృప్తి వ్యక్తం చేయగా, జనసేన నాయకుడు అడబాల నారాయణమూర్తి ఆయన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారి మధ్య స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం నారాయణమూర్తి సభ నుంచి నిష్క్రమించారు.



చైర్‌పర్సన్‌గా ప్రమాణం చేస్తున్న సీహెచ్ మంగాబాయి

స్మార్ట్ మీటర్లను తక్షణం రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలకు షాక్ కొట్టే ఆదానీ స్మార్ట్ మీటర్లను తక్షణం రద్దు చేయాలని లేని పక్షంలో ఉద్యమాలకు సిద్ధమని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ, కరపత్రాలను పంచి, ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ నేటి ప్రభుత్వం ప్రగల్భాలు పలికే పార్టీ అన్నారు. సంవత్సరంలో 15,485 కోట్ల రూపాయలు ప్రజలపై భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఐక్యమత్యంతో పోరాడి కూటమి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దూరం చేస్తారని చెప్పారు. నాయకులు శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, కన్నంరెడ్డి శివాజీ, దత్తు రాము, బర్ల బాలాజీ, పెద్ద సోమరాజు, బి.వెంకటేశ్వరరావు, యడ్ల శ్రీను, పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

మంటలాంబ ఆలయానికి ప్రహరీ గోడ నిర్మాణం

ఇరగవరం: మండలంలో వేంచేసియున్న చిన్న, పెద్ద మంటలాంబ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం దాతలు, భక్తులు, ఆలయ అభివృద్ధి కమిటీ సహాయ సహకారాలతో సుమారు రూ.10 లక్షలతో ఆలయానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం శరవేగంగా చేస్తున్నారు. ఎంతో మహత్యం గల మంటలాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఏం కోరుకున్నా జరుగుతుందని భక్తుల నమ్మకం. ఈ నమ్మకంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మంటలాంబ అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయనికి ఆదివారం, మంగళవారం, శుక్రవారం మిగిలిన అన్ని వారాల్లో, జాతర సమయాల్లో భక్తుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఆలయం వద్ద ఎప్పటి నుంచో ప్రహరీ గోడ నిర్మాణం సరిగ్గా లేదు. దీంతో పశువులు, చాలా మంది గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం లోపలికి వచ్చే వారు పశువులు అయితే లోపల ఉన్న మొక్కలు తినేసేవి. ఆలయం వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ప్రహరీ గోడ నిర్మాణం సరిగా లేకపోవడంతో ఎప్పుడు ఎవరు వచ్చి ఏం చేస్తారని ఆందోళన చెందాల్సి వచ్చేది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆలయ అభివృద్ధి కమిటీ ఆలోచనతో ప్రహరీ గోడ నిర్మాణం ప్రారంభించారు. అమ్మవారి ఆలయానికి నాలుగు వైపులా ఈ నిర్మాణ పనులు చేస్తున్నారు. అమ్మవారి జాతర సమయానికి ప్రహరీ గోడ నిర్మాణం పూర్తవుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చెబుతున్నారు. నిర్మాణ పనులు ఆలయ కార్య నిర్వహణ అధికారి సూర్యానారాయణ పర్యవేక్షిస్తున్నారు. ఈ మంచి పనితో భక్తులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మంటలాంబ ఆలయానికి నిర్మిస్తున్న ప్రహరీ గోడ

వ్యభిచార గృహంపై దాడి

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక పాతూరు ప్రాంతంలో ఓ గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం పట్టణ సీఐ ఆ ప్రాంతానికి వెళ్లి తనిఖీ చేశారు. సీఐ ఆది ప్రసాద్ వెల్లడించిన వివరాల మేరకు పాతూరులోని ఓ గృహాన్ని తనిఖీ చేయగా ఒక విటుడు, నిర్వాహకుడు, ఓ మహిళను అదుపులో తీసుకొని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

మన్‌కీ బాత్‌కు విశేష స్పందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): మన్ కి బాత్, ప్రధాని మోడీ మనస్సులో మాటకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బీజేపీ నాయకులు కొనియాడారు. వీకర్స్‌కాలనీలో 101 పోలింగ్ బూత్ ఇంచార్జి గోకా మహాలక్ష్మీ నివాసంలో ఆదివారం మన్‌కి బాత్‌ను ఆన్‌లైన్‌లో వీక్షించారు. జిల్లా ఇన్‌చార్జి నరిసే సోమేశ్వరరావు, నాయకులు దువ్వా శ్రీనివాసరావు, ఎన్నేటి వెంకట లక్ష్మి, గోకా మహాలక్ష్మి, కంచుమర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నరసాపురం: పేదల చదువులకు సహకారం అందించడానికి స్వచ్ఛందసంస్థలు ముందుకు రావడం గొప్ప విషయమని నరసాపురం ఎంపీపీ మైలాబత్తుల సోనీ అన్నారు. రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మొగల్తూరు రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బాలికలు 300 మందికి పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ సోనీ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువులకు అందించిన సహకారం వృథా కాదన్నారు. కార్యక్రమంలో రాజ్‌ట్రస్ట్ చైర్మన్ గంటా రాజ్‌కుమార్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంగా సుందర్‌కుమార్, వైఎస్సార్ సీపీ సీనియర్‌నేత నల్లిమిల్లి జోసఫ్, కౌన్సిలర్లు అడిదల శ్యామల, జిల్లెళ్ల దిలీప్, దొండపాటి స్వాములు పాల్గొన్నారు.

సామూహిక గాయత్రి నామజపం

యలమంచిలి: మండలంలోని శిరగాలపల్లిలో శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో ఆదివారం అక్షర కోటి గాయత్రి సామూహిక జపం ఘనంగా నిర్వహించారు. గతేడాది కల్వకొలను చిత్తరంజన్ దాస్ స్మారక సేవా సంస్థ అయోధ్యలో పూజ్య గురుదేవులు కల్వకొలను శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో లోక శాంతి, విశ్వ కల్యాణ కోసం జప యజ్ఞం చేశారు. దాని కొనసాగింపుగా నవంబర్ ఒకటి వరకు విశ్వవ్యాప్తంగా అక్షర కోటి గాయత్రి జపం జరుగుతుంది. ప్రతిరోజూ జపతలు వారి ఇళ్లలోనే గాయత్రి జపమాచరిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం శిరగాలపల్లిలో స్థానిక సంఘ అధ్యక్షులు గుత్తిన నరసింహమూర్తి (బాబ్జి), అమలాపురం జోన్ సమన్వయకర్త మిర్తిపాటి వేంకట రామయ్య శర్మల నేతృత్వంలో విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి గాయత్రి సామూహిక జపం చేశారు. ఈ కార్యక్రమంలో 10 మంది జపతలు పాల్గొన్నారు. జపమానంతరం 11 మార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. చివరగా ప్రసాద వితరణ చేశారు. రాచర్ల అన్నాజీరావు శర్మ, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



శిరగాలపల్లిలో అక్షర కోటి గాయత్రి సామూహికజపం చేస్తున్న దృశ్యం

పశువుల ప్రాణం తీస్తున్న ప్లాస్టిక్

యలమంచిలి: ప్లాస్టిక్ పశువులకు ప్రాణాంతకంగా మారుతుంది. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు, వైద్య సామగ్రి, పాచిపోయిన అన్నం తదితర వ్యర్థాలను తిని పశువులు మృత్యువాత పడుతున్నాయి. పాలకొల్లు పట్టణంలో ఎక్కడ చూసిన వీధి పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. యజమానులు వీటి ఆలనాపాలనా చూడకపోవడంతో రహదారుల పక్కన పడేసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయి. పురపాలక సంఘ ప్రజారోగ్యాధికారులు, ఆవుల పెంపకందారుల బాధ్యతారాహిత్యం ఆవుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పశు వైద్యులు చెబుతున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు సంత మార్కెట్, యడ్లబజార్, పెద గోపురం, గజలక్ష్మీ సెంటర్ తదితర ప్రాంతాల్లో పశువులు తిరుగుతున్నాయి. ఆవులు మన కళ్ల ముందు కనిపించడం శుభప్రదం అనుకున్నా.. అవి తింటున్న ప్లాస్టిక్‌ను చూస్తే అయ్యో అనిపిస్తుందని పట్టణవాసులు చెబుతున్నారు.

రోడ్లపై సంచారం

పట్టణంలోని ప్రధాన రోడ్లలో పశువులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. కొన్నిసార్లు ఒకదానిపై ఒకటి దాడులు చేసుకోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పాఠశాలలు ఉండే ప్రాంతాల్లో పొరపాటున చిన్నారులపై దాడి చేస్తే దేవుడే దిక్కు. ఇక ప్రధాన కూడళ్లలోనూ రోడ్డుకు అడ్డంగా రాకపోకలు సాగిస్తున్నాయి. పొరపాటున వాహనదారులకు తగిలితే ప్రమాదాలు జరగడంతో పాటు పశువులు గాయపడే పరిస్థితి లేకపోలేదు. ఆవులను సంరక్షించడంలో పెంపకందారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ఆవులను గోశాలకు తరలించడమే ఉత్తమం అని పట్టణవాసులు చెబుతున్నారు. గోశాల నిర్వాహకులు ఆవులను దేవుళ్లుగా భావించి పశుగ్రాసాన్ని అందిస్తారు. పెంపకందారులు కూడా ఆవులను బయటకు వదలకుండా చూసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా పురపాలక సంఘ అధికారులు గోవులపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాలకొల్లులో రోడ్లపై ప్లాస్టిక్ తింటున్న ఆవులు (ఫైల్)

షాపింగ్ కాంప్లెక్స్‌లు ఎక్కువ.. ఆదాయం తక్కువ

- ఆదాయం పెంపుపై నరసాపురం మునిసిపాలిటీ నిర్లక్ష్యం
- మునిసిపాలిటీకి గుదిబండగా అల్లూరి కాంప్లెక్స్



అంతంత మాత్రంగా ఆదాయం వస్తున్న మునిసిపాలిటీ ప్రధాన అల్లూరి షాపింగ్ కాంప్లెక్స్

నరసాపురం: ఆదాయ మార్గాలు పెంచుకునే విషయంలో నరసాపురం మున్సిపాలిటీ తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తోంది. పట్టణంలో మునిసిపాలిటీకి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ల పరిస్థితిని గమనిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. పట్టణంలో మొత్తం 14 మునిసిపల్ కాంప్లెక్స్‌లు, వాటిలో 250 వరకూ షాపులు ఉన్నాయి. వీటి ద్వారా మునిసిపాలిటీకి కేవలం నెలకు రూ.2.85 లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. చాలా షాపులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. సెంటర్‌లో ఉన్న కీలకమైన అల్లూరి సత్యనారాయణరాజు షాపింగ్ కాప్లెక్స్‌లో కూడా షాపులు భర్తీకాని పరిస్థితి.

నిబంధనలకు విరుద్ధంగా లీజులు

ఇక షాపుల లీజుల విషయంలో కూడా అధికారులు నిబంధనలకు నీళ్లు వదలడం, వ్యాపారులతో లాలూచీ పడటంతో అద్దెలు పెరగని పరిస్థితి. దీర్ఘ కాలంపాటు తరతరాలుగా ఒకరే పలుకుబడితో షాపులు దక్కించుకోవడం, తక్కువ లీజులు చెల్లిస్తుండడం గమనార్హం. లోపాలను సరిదిద్ది, మునిసిపల్ అధికారులు ఆదాయం పెంచుకోవడానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్‌ల నిర్మాణం ప్రణాళికాబద్ధంగా, వ్యాపారాలకు అనువుగా లేకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఈ కారణం వల్లనే షాపుల భర్తీ జరగడంలేదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కొత్త కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అవకాశం ఉన్నప్పటికీ మునిసిపాలిటీ దృష్టి పెట్టడంలేదు.

గుదిబండగా మారిన అల్లూరి కాంప్లెక్స్

మున్సిపాలిటీకి కీలకమైన కాంప్లెక్స్‌గా పట్టణ నడిబొడ్డున ఉన్న అల్లూరి సత్యనారాయణరాజు కాంప్లెక్స్. అయితే ఈ కాంప్లెక్స్ కట్టిన నాటినుంచి ఆదాయంలేక, మున్సిపాలిటీకి గుదిబండగా మారింది. ఆలోచనాత్మకంగా కాంప్లెక్స్ నిర్మాణం చేయకపోవడంతో వ్యాపారాలకు ఇప్పటికీ అనువుగా లేకపోవడంతో సరైన ఆదాయం సమకూరడంలేదు. కాంప్లెక్స్‌పై అంతస్తులు పూర్తిగా ఖాళీగా నిరుపయోగంగా ఏళ్ల తరబడి దర్శనమిస్తున్నాయి. ఆదాయంలేని అల్లూరి కాంప్లెక్స్‌ను కార్పొరేట్ తరహాలో అభివృద్ధిచేయాలని మూడేళ్లక్రితం అప్పటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తీవ్రంగా ప్రయత్నించారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో కాంప్లెక్స్‌ను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేసేలా, వ్యాపారులకు నష్టంలేకుండా పాతవారే తిరిగి వ్యాపారాలు చేసుకునేలా ప్రణాళిక తయారు చేయించారు. అయితే అది అమలుకాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఇప్పటికీ నరసాపురం మున్సిపాలిటీ ఆదాయం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆదాయం పెంపుపై దృష్టి పెడతాం



మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల ఆదాయం పెంపుపై దృష్టిపెడతాము. అల్లూరి కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులను పూర్తిస్థాయిలో భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఖాళీగా ఉన్న కొన్ని షాపులను ఇటీవల భర్తీ చేశాం. ఆదాయం పెంపునకు సంబంధించి అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. అల్లూరి కాంప్లెక్స్‌కు ఆదాయం రాని మాట వాస్తవమే.

– బర్రి శ్రీవెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్

ఉపాధి పనుల అవకతవకలపై చర్యలేవి?

వీరవాసరం: నీతి నిజాయతీతో పాలన సాగిస్తామంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా ఆ పార్టీల నేతలు మాత్రం పెద్దెత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో సైతం అవకతవకలు చేసి సొమ్ము కాజేస్తున్నారు. అక్రమాలను గుర్తించిన అధికారులు సైతం వీటిపై చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరవాసరం మండలం మెంటేపూడి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉపాధి హామీ పనులకు వెళ్లకుండానే మస్టర్లో పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వ సొమ్మును కాజేశారు. ఒక పనిని 20 మంది చేస్తే సుమారు 45 నుంచి 50 మంది పేర్లను మస్టర్లలో నోట్ చేసి ఆ డబ్బులు నొక్కేశారు.

అధికారులకు ఫిర్యాదు

గ్రామంలో రూ.3 నుంచి రూ.4 లక్షల మేర అవినీతి జరిగిందని గ్రామస్తుడు పత్తుల టైసన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిర్వహించిన అధికారులు ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిని గుర్తించారు. అయితే ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని దాసరి మాణిక్యాలరావు వివరించారు.